క్లుప్తంగా

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలోని ఆశా కార్యకర్తలకు పెండింగ్ వేతనాలను ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు ప్రతి నెల 1వ తేదీనే వేతనాలను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూని యన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, జిల్లా కోశాధికారి అమ్ములు, ఉపాధ్యక్షురాలు అనసూయ, సుబ్బలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి ధనుర్మాస పూజలు

కడప కల్చరల్ : ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఈనెల 17 నుంచి తమ ఆలయంలో విశేష పూజలు నిర్వహించనున్నామని అర్చకులు విజయ్‌భట్టర్ తెలిపారు. కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం నుంచి ధనుర్మాస పూజలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. నెలరోజులపాటు శ్రీ గోదా సమేత లక్ష్మి నారాయణస్వామి సన్నిధిలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 23న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనం ఉంటుందన్నారు.

12 నుంచి పుస్తక ప్రదర్శన

కడప కల్చరల్: సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు పుస్తకాల ప్రదర్శన, ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య రామప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా పాఠకులు, పుస్తక ప్రియులు, ప్రజలు తమ వద్దనున్న పోటీ పరీక్షల పుస్తకాలు, సాహిత్య గ్రంథాలు, గైడ్లు, భక్తి రచనలు, ఆధ్యాత్మిక గ్రంథాలు, కథల పుస్తకాలు, నవలలు లాంటి పుస్తకాలను ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న వాటిని తమ కేంద్రానికి అందజేయాలని కోరారు. ఈనెల 12వ తేదీ లోగా అందజేసి ఉచిత పుస్తక పంపిణీలో భాగస్వాములు కావాలన్నారు. దాతల నుంచి సేకరించిన పుస్తకాలను ప్రదర్శనగా ఉంచుతామని, అవసరమైన వారికి ఒక్కొక్కరికి ఐదు పుస్తకాలను ఉచితంగా అందజేస్తామన్నారు. వివరాలకు 94940 77736, 94901 35295 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

పరిశుభ్రతతోనే దోమల నిర్మూలన



ప్రకాష్‌నగర్‌లో పర్యటిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్: ఇంటి లోపల, పరిసరాల పరిశుభ్రతతోనే దోమలను నిర్మూలించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం ప్రకాష్‌నగర్‌లో ఫ్రై డే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంను డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటి లోపల తొట్లు, బానలు, కుండలు పాత సామాన్లు ఉంటే పరిశుభ్రంగా నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. అలాగే పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆయన దోమల నిర్మూలనకు స్థానికులకు, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హైమావతి, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వెంకటరెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ నాగలక్ష్మిరెడ్డి, ఏఎన్‌ఎం పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్: ఈ నెల 17వ తేదీ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ పెన్షనర్ల సంఘ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పెన్షనర్ల సంఘం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు కోరారు. ఈ కార్యక్రమాన్ని 17న ఉదయం 10.30 గంటలకు కడప బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరు కావాలని డిప్యూటీ సీఎం అంజాద్‌బాష, కడప నగర మేయర్ సురేష్‌బాబులను పెన్షనర్ల సంఘం నాయకులు శుక్రవారం ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి, నాయకులు రాధాక్రిష్ణ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ చింతా సుధాకర్

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం భూగర్భ శాస్త్ర ఆచార్యులు డాక్టర్ రఘుబాబు ఆధ్వర్యంలో జియాలజీకి సంబంధించిన విశేషాలతో కూడిన పుస్తకాన్ని తీసుకు రావడం అభినందనీయమని వైవీయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం వైవీయూలో ఆచార్య రఘుబాబు రచించిన 'ఎమోలియన్ డిసర్టిఫికేషన్' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా దేవదేవుడి కల్యాణం

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణ వేడుక వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ గోవిందమాల భక్తబృంద సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, అనంతరం తోమాల సేవ, అర్చనలు నిర్వహించారు. 9 గంటల నుంచి కల్యాణోత్సవం ప్రారంభమైంది.

ముగ్ధమనోహరం..

కల్యాణ ఘట్టంలో భాగంగా కుడివైపున నూతన వరుడిగా శ్రీవారిని, ఎడమవైపు ఉభయదేవేరులైన శ్రీదేవి, భూదేవి మాతలను వధువులుగా అలంకరించి కొలువుదీర్చారు. వేద పండితులు కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. పుణ్యాహవాచనం, కలశ ప్రతిష్ఠ, గణపతిపూజ, ప్రవరలు, యజ్ఞోపవీత ధారణల అనంతరం సంప్రదాయంగా కన్యాదానం చేశారు. మహామంగళ సూత్రాలను భక్తులందరికీ దర్శింపజేశారు. అనంతరం మంగళ వాయిద్యాల సుస్వరాలు, వేదమంత్రోచ్చాటనల మధ్య కల్యాణ వేడుక నిర్వహించారు. భక్తులందరికీ మంగళాక్షతలను కల్యాణ ప్రసాదంగా అందజేశారు. హాజరైన వారందరికీ వివాహ భోజనం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులతో కడప నగరంలోని పలు ముఖ్య కూడళ్లలో సందడిగా గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రముఖుల హాజరు..

కల్యాణోత్సవానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, నగర మేయర్ సురేష్‌బాబు, టీటీడీ బోర్డు మెంబర్ యానాదయ్యలు హాజరయ్యారు. నిర్వాహకులు వారిచే పూజలు నిర్వహింపజేశారు. వేద పండితులు వారిని ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, నగర మేయర్ సురేష్‌బాబు



శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణ వేడుక సందర్భంగా గోవింద నామస్మరణ చేస్తున్న భక్తులు

జనరంజక పాలన జగనన్నతోనే సాధ్యం

– ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే జనరంజకపాలన సాధ్యమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక నాగరాజుపేటలోని 23వ డివిజన్‌లో కార్పొరేటర్ తుంగా విజయలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి, 24వ డివిజన్‌లో కో ఆపరేటివ్ కాలనీలో కార్పొరేటర్ ప్రమీలరాణి ఆధ్వర్యంలో ×ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి₹ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రం ఇంకా అభివృద్ధి చెందాలన్నా, ప్రజల జీవితాలు బాగుపడాలన్నా మళ్లీ జగనన్నే సీఎం కావాలన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదలకు మేలు చేయడం జరిగిందన్నారు. కరోనా సమయంలో ప్రభుత్వం వలంటీర్ల ద్వారా విశేష సేవలందించిందని, ఎన్ని కష్టాలు వచ్చినా ప్రభుత్వ పథకాలను మాత్రం ఆపలేదన్నారు. మంచి మనసున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్య యాదవ్, సీహెచ్ వినోద్ కుమార్, మేసా ప్రసాద్, షఫీ, మల్లికార్జున, ఎస్ సుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, తోటక్రిష్ణ, సుభాన్‌బాషా, చాన్‌బాషా, భాస్కర్, టీపీ వెంకట సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.



24వ డివిజన్‌లో సంక్షేమ పథకాల పట్టికను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

పేదల పక్షపాతి జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక 49వ డివిజన్‌లోని ఆలంఖాన్‌పల్లెలో 'వె ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆయన పాల్గొని వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, 49వ డివిజన్ ఇన్‌చార్జి మధువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంజే కుంటలో....

కడప నగరంలోని 11వ డివిజన్ మృత్యుంజయకుంటలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేసీఎస్ అధ్యక్షుడు తోటక్రిష్ణ, కన్వీనర్ మల్లికార్జున ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ పథకాల పట్టికను, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించి గత టీడీపీ ప్రభుత్వం, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాలకు ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో 11వ డివిజన్ ఇన్‌చార్జి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

– జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్



కేసుల పరిష్కారంపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తులు

కడప అర్బన్: జిల్లాలో వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో వున్న కేసుల్లో రాజీ కాదగిన కేసులను పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయసేవాసదన్‌లో పోలీసులు, న్యాయవాదులు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు న్యాయమూర్తులచేత క్రిమినల్ కేసుల్లో పరిష్కరించదగిన వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కడప ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ జె. హేమస్రవంతి, ఫస్ట్ ఏడీఎం జె. నందిని, సెకండ్ ఏడీఎం కె. భార్గవి, కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్, సీఐలు, ఎస్ఐలు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీక్రిస్మస్ వేడుకల్లో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: యేసుక్రీస్తు గొప్ప మహిమాన్వితుడని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు అన్నారు. శుక్రవారం రక్షణ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పి. సంపత్ కుమార్, చైతల్య ఆధ్వర్యంలో స్థానిక ప్రేమాలయం నిరాశ్రయుల వసతి గృహంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, యేసుప్రభువు కృప అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డా. సొహైల్, ఎస్. సుబ్బారెడ్డి, సమరనాథరెడ్డి, బంగారు నాగయ్య, మల్లికార్జున కిరణ్, రామ్మోహన్‌రెడ్డి, శ్యాంసన్, సునీల్, షఫీ, బుజ్జి, నాగేంద్ర, తులశమ్మ, సావిత్రమ్మ పాల్గొన్నారు.

జ్యోతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : తొగట వీరక్షత్రియుల కుల దైవం అయిన శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని తొగటవీరక్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ పేర్కొన్నారు. తొగటవీరక్షత్రియ కళ్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జ్యోతి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని అన్ని చౌడేశ్వరిదేవి ఆలయాల నిర్వాహకులు ఆదివారం అమ్మవారికి విశేష పూజాకార్యక్రమాలు అలంకరణ, మధ్యాహ్నం బిందెసేవ చేస్తారన్నారు. అర్ధరాత్రి అమ్మవారి గ్రామోత్సవం, జ్యోతి ఉత్సవాలు ప్రారంభమై సోమవారం తెల్లవారుజాము వరకు నిర్వహిస్తారన్నారు. ఈ ఏడాది దాదాపు 150 దాకా జ్యోతులు చేస్తున్నారన్నారు. రామేశ్వరం మోరీల వద్ద ఉన్న చౌడేశ్వరిదేవి ఆలయం వద్ద సోమవారం రాత్రి చౌడేశ్వరి నాట్యకళామండలి ఆధ్వర్యంలో నాటక అకాడమి డైరెక్టర్ బండారు లక్ష్మీదేవి సహకారంతో సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. కళ్యాణ మండప అధ్యక్షుడు బండారు రఘురామయ్య, గంజికుంట ఆంజనేయులు, శ్రీరాంనగర్ చౌడేశ్వరిదేవి ఆలయ అధ్యక్షుడు మోతుకూరి సుబ్బయ్య, రామయ్య, చౌడయ్య పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నివారణ చట్టంపై అవగాహన

వైవీయూ : యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ మార్గదర్శకం మేరకు ఈనెల 4 తేదీ నుంచి 9వ తేదీ వరకు 'సెక్సువల్ అరాస్మెంట్ ప్రివెన్షన్ వీక్' లో భాగంగా వైవీయూ జాతీయ సేవా పథకం యూనిట్-9 పీఓ, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లైంగిక వేధింపులు-నివారణ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్ , టెక్నాలజీ విభాగంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకట రామిరెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులకు లైంగిక వేధింపుల నివారణ చట్టం, గృహ హింస చట్టం -2005, పని ప్రదేశాలలో మహిళలపై రక్షణ చట్టాల గురించి అవగాహన కల్పించారు. డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ దిశా చట్టం ప్రకారం మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, లైంగిక వేధింపులను, దాడులను అరికట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దిశా చట్టం-2019 లో రూపొందించిందన్నారు. పోక్సో చట్టం గురించి వివరించారు. అలాగే సోషల్ మీడియా ద్వారా మహిళలను వేధించడం, వారిపై అసభ్యకరమైన పోస్టింగులను ప్రసారం చేయడం, ఈ-మెయిల్, డిజిటల్ విధానంలో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరావు

'ఆడుదాం ఆంధ్ర' నిర్వహణలో పారదర్శకత

కడప స్పోర్ట్స్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం నిర్వహణలో పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని కడప నగరపాలక టీపీఆర్‌ఓ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం కడప నగరంలోని నగరపాలకసంస్థ కార్యాలయంలో 'ఆడుదాం ఆంధ్ర' టోర్నమెంట్‌కు సంబంధించి వార్డు వలంటీర్లకు అంపైరింగ్, టోర్నమెంట్ నిర్వహణ, మొబైల్ లైవ్‌స్కోరింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్ నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీఎస్‌డీఓ ఎస్.వి.పి. అమృత్‌రాజ్ మాట్లాడుతూ ఐదుక్రీడాంశాల్లో నిర్వహించే ఈ మెగా టోర్నమెంట్ తొలుత సచివాలయస్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వలంటీర్లు అంపైరింగ్, నిర్వహణలో ఎలా మెలగాలో వివరించారు. మాస్టర్ ట్రైనర్లు ఎం. ప్రవీణ్‌కిరణ్, ఎజాస్‌అహ్మద్‌లు మాట్లాడుతూ మ్యాచ్‌ల నిర్వహణ, లైవ్‌స్కోరును ఏ విధంగా మొబైల్‌లో అప్‌లోడ్ చేయాలి అన్న అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ కోచ్‌లు శ్రీనివాసరాజు, కల్యాణ్, సుదర్శన్, నూర్, శ్రీధర్, విలియం కేరీ, వలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కడప నగరపాలక సంస్థ టీపీఆర్‌ఓ శ్రీనివాస్

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ పూర్తి చేశాను

– ఆర్‌ఓబీకి భూమి పూజ

– భూమి పూజలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : పట్టణ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ పూర్తి చేశానని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణ ప్రజల దశాబ్దాల కోరిక రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ)కి స్థానిక బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి భూమి పూజ చేసి మాట్లాడారు. తాను గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలనీ నెరవేర్చానన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రజల దశాబ్దాల కోరిక మరో ఏడాది కాలంలో నెరవేరబోతుందని సంతోషం వ్యక్తం చేశారు. రూ.39 కోట్లు ఆర్‌ఓబీ నిర్మాణానికి, మరో రూ.32 కోట్లు భూ బాధితులకు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మొత్తం రూ.72 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్ట్ పూర్తి అవుతుందన్నారు. కేంద్ర రోడ్ల శాఖా మంత్రి నితిన్ గడ్కరి రాష్ట్ర పర్యటనకు వచ్చిన సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 30 ఆర్‌ఓబీలు మంజూరు చేయాలని కోరారన్నారు. గడ్కరి ఫస్ట్ ఫేజ్‌లో 8, సెకండ్ ఫేజ్‌లో 12 ఆర్‌ఓబీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, అయితే ఫస్ట్ ఫేజ్‌లో మంజూరై భూమి పూజ చేసుకుంటున్న ఫస్ట్ ఆర్‌ఓబీ మనదేనన్నారు. ఆర్‌ఓబీ భూ బాధితులకు త్వరలోనే ఫైనాన్స్ క్లియర్ అవుతుందన్నారు. ఏడాదిన్నర కాలంలో ఆర్‌ఓబీ నిర్మించాలనే నిబంధనలు ఉన్నప్పటికి ఏడాదిలోపే ఆర్‌ఓబీ నిర్మాణం పూర్తి చేస్తామని అధికారులు చెప్పడం హర్షణీయం అన్నారు. అయితే నిర్మాణంలో నాణ్యతలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. వందల సంవత్సరాలు ఈ బ్రిడ్జి మనుగడలో ఉండేలా మంచి నాణ్యతతో పాటు బ్రిడ్జికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు, డ్రైనేజ్ తప్పనిసరిగా నిర్మించాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. ఇప్పటికే కమలాపురం పట్టణంలో వందల కోట్ల అభివృద్ధి పనులు చేశామని, కొన్ని పూర్తి అయ్యాయని, మరికొన్ని త్వరలోనే పూర్తి అవుతాయన్నారు. అలాగే త్వరలో పాగేరు వంక పై వంతెన, బైపాస్ రోడ్డు నిర్మాణాలకు భూమి పూజ చేస్తామన్నారు. కమలాపురంకు ఇన్ని నిధులు మంజూరు చేసిన సీఎం జగనన్నను కమలాపురం ప్రజలు మరో సారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పరిశ్రమల, ఉద్యాన శాఖ రాష్ట్ర సలహాదారులు రాజోలి వీరారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఇతర నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సీఎస్ నారాయణరెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, గంగాధర్‌రెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, హిదాయత్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌ఓబీకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కడప కార్పొరేషన్: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం కడప నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్. నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కడపలో రహదారుల విస్తరణ పనుల వల్ల విద్యుత్ స్తంభాలు మార్చాల్సి ఉందని, విద్యుత్ లైన్లకు, 220 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు. ఫలితంగా కలెక్టరేట్, జెడ్పీ కార్యాలయం, జిల్లా కోర్టు మినహా అన్ని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతాయన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ నుంచి మహిళలకు టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18-45 సంవత్సరాల మధ్య వయస్సుగల నిరుద్యోగ మహిళలు ఈ శిక్షణకు అర్హులన్నారు. వివరాలకు 94409 05478, 99856 06866 నెంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

సమ్మె నోటీసు

కడప కార్పొరేషన్: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు ఈనెల 27వ తేదీ సమ్మెలోకి వెళ్తామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. సుబ్బరాయుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి. వేణుగోపాల్, ఎల్. నాగసుబ్బారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ చంద్‌కు వారు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్‌స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని, డ్రైవర్లు, యూజీడీ వర్కర్లు, పార్కు వర్కర్లు, స్కూల్ స్వీపర్లకు హెల్త్ అలవెన్సులు ఇవ్వాలన్నారు. కరోనా విపత్తులో మరణించిన వారి కుటుంబాలకు రూ.50లక్షల చొప్పున చెల్లించాలన్నారు. టైం స్కేల్ వర్కర్లను రెగ్యులర్ చేయాలన్నారు. ఈ సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, నగర కార్యదర్శి మద్దిలేటి, నరసింహులు, తారక రామారావు, వెంకటాద్రి పాల్గొన్నారు.

నైతిక విలువలకు ప్రాధాన్యత



విద్యార్థినులతో అధికారులు

వైవీయూ : జీవితంలో విద్యతోపాటు విద్యార్థినిలకు నైతిక విలువలు ఎంతో ముఖ్యమని విశ్రాంత ఐపీఎస్ అధికారి చంద్రమౌళి సూచించారు. శుక్రవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య ఉత్తమ ఫలితాలు ఇస్తుందన్నారు. మనం ఎలా జీవించాలన్న అంశంపై రాజ్యాంగంలో చక్కటి మార్గదర్శనాలు ఉన్నాయన్నారు. అనంతరం పలు అంశాలపై ఆయన విద్యార్థులకు సందేహ నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష, హెల్త్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రియదర్శిని, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జి.విజయలక్ష్మి, ఎన్‌సీసీ సిటిఐ డి.విన్నీ తేజ, వై.నాగరత్నమ్మ తదితరులు ముఖ్య అతిథి చంద్రమౌళిని సత్కరించారు.

పనులు నాణ్యతగా చేయాలి



మార్నింగ్ విజిట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: కడప నగరంలో నూతనంగా నిర్మించే పార్కు పనులను నాణ్యతగా చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. శుక్రవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన ఈట్ స్ట్రీట్, శాస్త్రినగర్ పార్కు, అక్కాయపల్లె పార్కు, కేసీ కెనాల్ పార్కు, దేవునికడప చెరువు ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈట్ స్ట్రీట్ పనులను త్వరగా పూర్తి చేయాలని, వరదనీరు పోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. శాస్త్రినగర్, అక్కాయపల్లె, కేసీ కెనాల్ పార్కులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. దేవుని కడప చెరువును ఆధునీకరించాలని, అక్కడ వలస పక్షులు, జీవ వైవిధ్యంపై డాక్యుమెంటరీ రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ నారాయణస్వామి, ఏసీపీ నాగేంద్ర, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

గ్రూపు-2పై ఉచిత అవగాహన సదస్సు

కడప ఎడ్యుకేషన్: కడప ఆర్టీసీ బస్టాంగ్ సమీపంలోని తేజ పెట్రోల్ బంక్ పక్కన ఉన్న శంకర్‌రెడ్డీస్ సాయి బాలాజీ కోచింగ్ సెంటర్‌లో 10వ తేదీ ఉదయం 10 గంటలకు గ్రూపు-2 పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ శంకర్‌రెడ్డి తెలిపారు. ఇతర వివరాలకు 99667 87371, 8886142609 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

వెంకటసాయి కోచింగ్ సెంటర్‌లో..

కడప పాతబస్టాండ్ సమీపంలోని వెంకటసాయి కోచింగ్ సెంటర్‌లో 10వ తేదీ ఉదయం 10 గంటలకు గ్రూపు-2 పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ టక్కోలి దామోదర్‌రెడ్డి తెలిపారు. ఇతర వివరాలకు 9346634795 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.